## ఆంక్షలను అధిగమించి..

# ఫార్మా రద్దుకు నినదించి..

- ఫార్మాసిటీని రద్దు చేసే వరకూ పోరాడుతాం
- ట్రాక్టర్లలో కలెక్టరేట్‌కు వెళ్లిన ఫార్మా బాధిత రైతులు
- యాచారం, ఇబ్రహీంపట్నంలో భారీ బందోబస్తు



యాచారం : కలెక్టరేట్‌కు వెళ్లే ముందు నోటీసులను చూపుతున్న రైతులు

రంగారెడ్డి, ఫిబ్రవరి 8 (నమస్తే తెలంగాణ)/ యాచారం : ప్రభుత్వం, పోలీసులు అడుగడుగునా అడ్డంకులు సృష్టించినా ఫార్మా బాధిత బాధితులు శనివారం పెద్ద ఎత్తున కలెక్టరేట్‌కు చేరుకున్నారు. అక్కడి ప్రధాన గేట్ ఎదుట పెద్ద ఎత్తున నినాదాలతో హోరెత్తించారు. ఫార్మాసిటీని రద్దు చేసేవరకూ తమ పోరాటం ఆగదని.. ప్రాణం పోయినా భూములిచ్చేదిలేదని స్పష్టం చేశారు. ప్రభుత్వం చేస్తున్న బలవంతపు భూసేకరణను అడ్డుకుంటామని యాచారం మండలంలోని మేడిపల్లి, నానక్‌నగర్, తాటిపర్తి, కుర్మిద్ద గ్రామాలకు చెందిన అన్నదాతలు ముక్తకంఠంతో నినదించారు. ఫార్మాకు భూములిచ్చేదిలేదని పై నాలుగు గ్రామాలకు చెందిన రైతులు తెగేసి చెప్పడంతో ప్రభుత్వం 600 మంది రైతులకు నోటీసులు జారీ చేసి వ్యక్తిగతంగా హాజరు కావాలని ఆదేశించింది. దీంతో పలువురు రైతులు ఫార్మా వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో కలెక్టరేట్‌కు ట్రాక్టర్లలో అధిక సంఖ్యలో వెళ్లేందుకు సిద్ధమయ్యారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు పంచాయతీ ఎన్నికల దృష్ట్యా ఈ సమావేశాన్ని వాయిదా వేసినట్లు ఆర్డీవో అనంతరెడ్డి, తహసీల్దార్ అయ్యప్ప ఆదేశాల మేరకు వారు రైతులకు చెప్పారు. కలెక్టరేట్‌కు రైతులు రావొద్దని కోరారు. అయితే, రాలేదనే సాకుతో అధికారులు తమపని తాము చేసుకుంటారని భావించిన రైతులందరూ కలెక్టరేట్‌కు పయనమయ్యారు. ఇబ్రహీంపట్నం ఆర్డీవో, ఏసీపీ రైతులకు పలుమార్లు నచ్చజెప్పినా వారు వినిపించుకోలేదు. కలెక్టరేట్‌కు వచ్చిన వాహనాలను ఎక్కడికక్కడ నిలిపేసేందుకు పోలీసులు భారీగా బారికేడ్లను ఏర్పాటు చేశారు. అక్కడికొచ్చిన రైతులను కలెక్టరేట్‌కు వెళ్లేందుకు అనుమతి లేదంటూ పోలీసులు అడ్డుకోగా.. వారంతా ప్రధాన గేట్ ఎదుటే బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఫార్మాసిటీని వెంటనే రద్దు చేయాలని, బలవంతపు భూసేకరణను ఆపాలని, రైతుల పేర్లను ఆన్‌లైన్‌లో ఎక్కించాలని, జై కిసాన్..జై జైవాన్ అంటూ నినాదాలు చేశారు. కాంగ్రెస్ నాయ కులు మోసపూరిత హామీలతో రైతులను మభ్యపెట్టారని.. ఎన్నికలకు ముందు అధికారంలోకి రాగానే ఫార్మాసిటీని రద్దు చేస్తామని.. భూములిచ్చిన రైతులకు తిరిగి అప్పగిస్తామని చెప్పి.. పవర్‌లోకి రాగా నే వారంతా మొహం చాటేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం బలవంతంగా తమ భూములు లాక్కుకునేందుకు యత్నిస్తున్నదన్నారు. రికార్డుల్లో తమ భూములను నిషేధిత జాబితాలో చేర్చడంతో రైతుబంధుతోపాటు ఇతర సంక్షేమ పథకాలు అందడంలేదని చివరకు పిల్లల వివాహాలకు విక్రయించుకోలేని పరిస్థితి నెలకొన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే తమ భూములను తిరిగి తమ పేర్లపై ఆన్‌లైన్‌లో ఎక్కించాలని కలెక్టరేట్ ఎదుట పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కలెక్టర్ అందుబాటులో లేకపోవటంతో కలెక్టర్ ఏవో సునీల్‌కు బాధిత రైతులు తమ వినతిపత్రాన్ని అందించారు.

### రైతులపై పోలీసుల నిఘా

రైతులు ట్రాక్టర్లలో కలెక్టరేట్‌కు బయలు దేరుతున్నారనే సమాచారంతో పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. మేడిపల్లి, నానక్‌నగర్, కుర్మిద్ద, తాటిపర్తి గ్రామాల్లో అక్కడక్కడ రైతుల కదలికలను పోలీసులు గమనించారు. ఇబ్రహీంపట్నం ఏసీపీ రాజు యాచారం మండల కేంద్రానికి చేరుకొని మండలంలో జరుగుతున్న ఫార్మా రైతుల ఘటనపై హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ సీఐ కృష్ణంరాజు, యాచారం సీఐ నరసింహారావును అడిగి తెలుసుకున్నారు. రైతులు పెద్ద సంఖ్యలో ఒకచోట చేరకుండా బందోబస్తును ఏర్పాటు చేయాలని, ముఖ్యంగా యాచారం, ఇబ్రహీంపట్నం కేంద్రాల్లో నిఘా ఉంచాలని సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అయితే రైతులు మాత్రం పోలీసుల కండ్లు కప్పి కలెక్టరేట్‌కు చేరుకున్నారు.

### రైతులను విస్మరించిన కాంగ్రెస్

రైతులను కాంగ్రెస్ నాయకులు మోసం చేశారు. అధికారంలోకి రాగానే ఫార్మాసిటీని రద్దు చేస్తామని చెప్పి..పవర్‌లోకి రాగానే ఆ హామీని తుంగలో తొక్కారు. రైతుల వెంట ఉండి, రైతుల సమస్యలు తెలుసుకొని, రైతులతో కలిసి పాదయాత్రలు చేసి నేడు పదవులు రాగానే కాంగ్రెస్ నాయకులు



ఫార్మా బాధిత రైతులను విస్మరించడం సరికాదు. గతంలో యాచారంలో పర్యటించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు సీతక్క, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్సీలు కోదండరామ్, తీన్మార్ మల్లన్న, ఎమ్మెల్యే రంగారెడ్డి, రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డిలు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి తమకు పదవులు రాగానే రైతులను పూర్తిగా మర్చిపోవడం తగదు.

**- గడ్డం కుమార్, సీపీఎం నాయకుడు, మేడిపల్లి**

### రైతుల పర్యటనపై ఆర్డీవో ఆరా



యాచారంలో అధికారులతో చర్చిస్తున్న ఆర్డీవో, ఏసీపీ


ప్రభుత్వం నుంచి నోటీసులు అందుకున్న రైతుల పర్యటనపై ఇబ్రహీంపట్నం ఆర్డీవో ఆరా తీశారు. యాచారం తహసీల్దార్ కార్యాలయానికి చేరుకొని తహసీల్దార్ అయ్యప్పతో మాట్లాడారు. సమావేశం రద్దని చెప్పినా రైతులు కలెక్టరేట్‌కు ఎందుకు వెళ్తున్నారంటూ ప్రశ్నించారు.


పంచాయతీ ఎన్నికల దృష్ట్యా సమావేశానికి రావొద్దని చెప్ప లేదా అంటూ అడిగా రు. వందల మంది ఒకే చోట చేరితే సమస్యగా మారుతుందన్నారు. అంతమంది కాకుండా 20-30 మంది వస్తే కలెక్టర్‌తో మాట్లాడవచ్చన్నారు. విషయం తెలుసుకున్న ఏసీపీ రాజు ఆర్డీవోను కలిశారు. శాంతిభద్రతల విషయంపై ఆర్డీవో ఏసీపీతో చర్చించారు. ఎక్కడ అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు.

### స్థూపానికి పూలమాలలేసి..

నోటీసులు అందుకున్న బాధిత రైతులు మేడిపల్లి గ్రామంలో ఉన్న ఫార్మా వ్యతిరేక పోరాట సమితి స్థూపానికి పూలమాలలు వేసి, నల్లజెండాను ఆవిష్కరించారు. దీంతో హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీసులు అక్కడికి చేరుకొని రైతులపై ఆంక్షలు విధించారు. యా చారం, ఇబ్రహీంపట్నంలో బందోబస్తు ఏర్పా టు చేయగా విషయం తెలుసుకున్న రైతులు మేడిపల్లి స్థూపం వద్ద ఒకే చోట కలిసి ట్రాక్ట ర్లు, ఆటోల్లో కలెక్టరేట్‌కు చేరుకోవాలని నిర్ణయించుకున్నారు. అయితే వారందరూ ఎవరి గ్రామం నుంచి వారు ట్రాక్టర్లు, ఆటోల్లో ప్రధాన రహదారిని టచ్ చేయకుండా లింకు రోడ్ల గుండా కలెక్టరేట్‌కు బయలు దేరారు. పోలీసులు నిఘా ఏర్పాటు చేసినా వారి కుట్రలను తిప్పికొట్టారు.

మేడిపల్లిలో స్థూపం వద్ద ఫార్మాకు భూములిచ్చేదిలేదని నినదిస్తున్న రైతులు





కలెక్టరేట్ ప్రధాన గేటు ఎదుట బైఠాయించి నినాదాలు చేస్తున్న ఫార్మా బాధిత రైతులు

### బలవంతపు భూసేకరణ తగదు



ఫార్మాసిటీ ఏర్పాటుకు రైతుల నుంచి బలవంతంగా భూములను సేకరించడం దారుణం. ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా సాగు భూములను ఇచ్చే ప్రసక్తే లేదు. పచ్చని పంట పొలాలున్న భూములను ఫార్మాకు ఇస్తే రైతు కుటుంబాలు ఎలా బతకాలి. ప్రాణం పోయినా ఫార్మాకు భూములిచ్చేదిలేదు.

**-బొడ్డుపల్లి సందీప్‌రెడ్డి, రైతు మేడిపల్లి**



ట్రాక్టర్‌లో కలెక్టరేట్‌కు తరలుతున్న రైతులు

### ప్రభుత్వాన్ని, అధికారులను నమ్మొద్దు..



కాంగ్రెస్ సర్కార్, అధికారులను నమ్మొద్దు. ఫార్మాసిటీని యాచారం మండల ప్రజలు మొదటి నుంచి వ్యతిరేకిస్తున్నా.. ప్రభుత్వం మాత్రం తన తీరును మార్చుకోవడంలేదు. తమ భూములను ఇచ్చేది లేదని రైతులు తెగేసి చెబుతున్నారు. భూములను బలవంతంగా లాక్కోవద్దని కోర్టును కూడా ఆశ్రయించారు. కోర్టును ఆశ్రయించిన రైతులు శనివారం కలెక్టరేట్‌కు రావాల్సిందిగా కలెక్టర్ నోటీసులివ్వగా .. దాదాపుగా 600 మంది రైతులు కలెక్టరేట్‌కు వస్తుండగా పోలీసులు అడుగడుగునా అడ్డంకులు సృష్టించారు. తీరా రైతులు అక్కడికి చేరుకోగా కలెక్టర్ అందుబాటులో లేరు. కలెక్టర్ లేరని.. మరోమారు పిలుస్తామని ఆర్డీవో చెప్పినా తాము నమ్మలేదు. ఎందుకంటే ఆర్డీవో మాటలు విని కలెక్టరేట్‌కు రాకుంటే రైతులు గైర్హాజరయ్యారని ఆర్డర్ పాస్‌చేసి భూములు లాక్కునే ప్రయత్నం చేస్తారు. ఎట్టి పరిస్థితిలోనూ భూములిచ్చేది లేదు. ప్రాణ త్యాగానికైనా సిద్ధమే. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, మంత్రులు ఉత్తమ్, భట్టి, కోమటిరెడ్డి లాంటి వారు వచ్చి..మేము అధికారంలోకి రాగానే ఫార్మాసిటీని రద్దు చేసి రైతుల భూములను తిరిగి వారికే ఇస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు తమ గోడును పట్టించుకోవడం లేదు. ఫార్మాసిటీ కాదు ఫార్మా క్లస్టర్లు అంటూ కాంగ్రెస్ నాయకులు రైతులను అయోమయానికి గురి చేయడం మంచిది కాదు.

**-కావుల సరస్వతి, ఫార్మా వ్యతిరేక భూపోరాట సమితి సమన్వయకర్త**

### ప్రభుత్వం మాట నిలబెట్టుకోవాలి

అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ నాయకులు రైతుల పట్టా భూములను ఫార్మాసిటీ ఏర్పాటుకు తీసుకోమని.. ఒకవేళ తీసుకున్న వాటిని తిరిగి రైతులకే ఇస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ నాయకుల మాటలు నమ్మి తామంతా ఆ పార్టీకే ఓట్లేశాం. కానీ పవర్‌లోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, మంత్రులు ఉత్తమ్, భట్టి, కోమటిరెడ్డి లాంటి వారు గోడు పట్టించుకోవడం లేదు. వెంటనే భూములను తమ పేరిట ఆన్‌లైన్‌లో మార్చిడి చేయాలి



**-చంద్రారెడ్డి, నానక్‌నగర్**

### ఫార్మాసిటీని రద్దు చేయాలి



ఫార్మాసిటీని వెంటనే రద్దు చేయాలి. రైతుల భూములను తిరిగి వారికే ఇవ్వాలి. ఆన్‌లైన్‌లో టీఎస్ఐఐసీ పేరు తొలగించి రైతుల పేర్లు నమోదు చేయాలి. రైతులకు రైతు భరోసా, రైతుబీమా, పంట రుణాలు, రుణమాఫీ పథకాలు వర్తించేలా చూడాలి. భూములు రిజిస్ట్రేషన్ అయ్యేలా చర్యలు తీసుకోవాలి. రైతుల గోడును అర్థం చేసుకొని ఎన్నికల ముందుచ్చిన హామీని కాంగ్రెస్ పార్టీ పెద్దలు నెరవేర్చాలి. లేకుంటే ఫార్మాసిటీని రద్దు చేస్తూ స్పష్టమైన జీవో వచ్చే వరకూ రాజకీయాలకు అతీతంగా ఉద్యమాలు చేస్తాం.

**- కానమోని గణేశ్, ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ నాయకుడు**

---

## ఎస్‌హెచ్‌జీలను

# బలోపేతం చేస్తాం

- అందుకు పీఆర్‌పీ వ్యూహాన్ని అనుసరిస్తాం
- వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్



సమావేశంలో మాట్లాడుతున్న వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్

వికారాబాద్, ఫిబ్రవరి 8 : గ్రామాల్లో మహిళా స్వయం సహాయక సంఘా ల(ఎస్‌హెచ్‌జీ)ను బలోపేతం చేసేందుకు పీఆర్‌పీ వ్యూహాన్ని అనుసరిస్తా మని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్ పేర్కొన్నారు. శనివారం వికారాబాద్ కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో సీఆర్‌పీ మహిళలతో ఆయన మాట్లాడా రు. మహిళా సంఘాల బలోపేతానికి సీఆర్‌పీ వ్యూహం కార్యక్రమాన్ని జిల్లాలో ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. ఒక గ్రూప్‌లో ముగ్గురు చొప్పున 15 బృందాలు, 45 మంది మహిళలు ఉంటారని.. జిల్లాలోని ధారూరు, దోమ, వికారాబాద్, మర్పల్లి, మోమిన్‌పేట మండలాల్లో సీఆర్‌పీలు మహిళా సంఘాల ఏర్పాటుకు కృషి చేస్తారన్నారు. సీఆర్‌పీలు తమకు కేటాయించిన గ్రామాలకెళ్లి మహిళలకు అవగాహన, శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. సమావేశంలో డీఆర్‌డీవో శ్రీనివాస్, అదనపు డీఆర్ డీఏ పాల్గొన్నారు.





మాసబ్ చెరువును పరిశీలిస్తున్న హైడ్రా, ఇరిగేషన్ శాఖల అధికారులు



చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో నింపిన మట్టి

# మాసబ్ చెరువు పరిశీలన

**చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో మట్టి నింపుతున్నారన్న ఫిర్యాదుతో..**

తుర్కయాంజాల్, ఫిబ్రవరి 8 : తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధి మాసబ్‌చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో కొందరు వ్యక్తులు మట్టిని నింపుతున్నారనే ఫిర్యాదుతో శనివారం హైడ్రా, ఇరిగేషన్ శాఖల అధికారులు మాసబ్‌చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా హైడ్రా విచారణాధికారి శ్యాంసుందర్‌రెడ్డి, హైడ్రా టీమ్ సభ్యుడు తుర్కయాంజాల్ మాసబ్ చెరువు పరిధి సర్వేనంబర్ 175 ఎఫ్‌టీఎల్ పరిధిలో మట్టి నింపిన ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం ఇరిగేషన్ శాఖ ఏఈ వశీంధర్ మాట్లాడుతూ.. కొందరు వ్యక్తులు మాసబ్‌చెరువు సర్వేనంబర్ 175 ఎఫ్‌టీఎల్ పరిధిలో రాత్రి సమయాల్లో టిప్పర్లతో మట్టిని నింపుతున్నారని ఫిర్యాదులు అందడంతో చెరువును పరిశీలించినట్లు చెప్పారు. అక్రమంగా మట్టిని నింపుతున్న వారిని గుర్తించి చర్యలు తీసుకుంటామ న్నారు.

## సమయానికంటే ముందే వెళ్లిపోయారు..

### 14 మంది ఉద్యోగులపై కలెక్టర్ చర్యలు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 8(నమస్తే తెలంగాణ): అనుమతి లేకుండా కార్యాలయం నుంచి సమయం కంటే ముందుగానే వెళ్లిపోయిన ఉద్యోగులపై హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి చర్యలు తీసుకున్నారు. జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ కార్యాలయంలో పనిచేస్తున్న 14 మంది సిబ్బంది శుక్రవారం విధులకు వచ్చి అటెండెన్స్‌లో సంతకం చేసిన వెంటనే వెళ్లిపోయినట్లు తెలిపారు. వారి ఒక రోజు వేతనం నిలుపుదలతో పాటు సర్వీస్‌ను కౌంట్ చేయొద్దని ఆదేశిస్తూ ఎఫ్ఆర్ 18 ప్రకారం, శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

## అన్నిగ్రామాల్లోనూ

# బీఆర్ఎస్ జెండా ఎగరాలి

- స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి
- బీఆర్ఎస్ మండల విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశంలో రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 8 : త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని గ్రామాల్లోనూ బీఆర్ఎస్ జెండాలను ఎగురవేసేందుకు శ్రేణులు సిద్ధం కావాలని బీఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. శనివారం బీఆర్ఎస్ మండల విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం మండలాధ్యక్షుడు చిలుకల బుగ్గరాములు అధ్యక్షతన జరిగింది. దీనికి మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అలవి కాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రజలను అన్ని విధాలా ఆగం చేస్తున్నదని మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన పథకాలను సక్రమంగా కొనసాగించడం లేదన్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు రూ.470 కోట్ల అభివృద్ధి పనులకు ప్రొసీడింగ్‌లు ఇచ్చామని, నేటికీ ఆ పనులనే చేసుకుంటూ ప్రస్తుత ఎమ్మెల్యే రంగారెడ్డి శిలాఫలకాలకు ప్రారంభోత్సవాలు చేస్తూ కాలయాపన చేస్తున్నారని, అభివృద్ధికి గాలికి వదిలేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ హయాంలో జరిగిన అభివృద్ధి.. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న నయవంచన పాలనను ప్రజలకు వివరించి.. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను అధికంగా గెలిపించాలని సూచించారు.

### అక్రమ కేసులు బనాయిస్తే ఊరుకోం..

నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో బీఆర్ఎస్ కార్యకర్తలపై కాంగ్రెస్ నాయకులు చెప్పిన మాటలు విని పోలీసులు అక్రమ కేసులు బనాయిస్తే ఠాణాల ఎదుట ధర్నాలు నిర్వహిస్తామని మంచిరెడ్డి కిషన్‌రెడ్డి హెచ్చరించారు. పోలీసులు ప్రజలకు మేలు చేయాలి. కానీ, ఇబ్బందులకు గురి చేయొద్దని సూచించారు.

కార్యక్రమంలో మాజీ ఎం పీపీ కృపేశ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఏర్పుల చంద్రయ్య, మాజీ వైస్ ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీలు భరత్‌రెడ్డి, అచ్చన శ్రీశైలం, జ్యోతి, మాజీ సర్పంచ్ రాంరెడ్డి, సహకార సంఘం చైర్మన్లు మహేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల ప్ర ధాన కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, మున్సిపల్ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్‌రావు, బీఆర్ఎస్ యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు జెర్కొని రాజు, బీఆర్ఎస్వీ నియోజకవర్గ అధ్యక్షుడు నిట్టు జగదీశ్వర్, బీఆర్ఎస్ నాయకులు డేరంగుల సత్యనారాయణ ,కం బాలపల్లి హన్మంత్‌రెడ్డి, మంద సురేశ్, మంగ వెంకటేశ్, గరిగె శేఖర్‌గౌడ్, ప్రసాద్‌గౌడ్, శేఖర్‌గౌడ్, బల్వంత్‌రెడ్డి, యాదగిరి, నర్సింహారెడ్డి, ఐలయ్య, పలువురు నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.